ఎవర్నేనా కుష్టురోగుల్ని తెమ్మని తన జవానుతోనే చెప్పేడు మాధుసూదను, జవాను నలుగురు రోగుల్ని తీసుకొచ్చేడు. ముగ్గురు మొగా, ఒక ఆడ.

నరకంనుండి జారిపోయిన పాపుల్లా వున్నారువాళ్ళు.

వాళ్ళని చూస్తే నిన్నటి డిన్నర్ వాంతి అయేటట్టుంది.

వాళ్ళని సగం ఉడికించి, కాలినట్టున్నారు.

వాళ్ళ ముక్కులు విరిగి వాచివున్నాయి.

వాళ్ళ పెదవులు వాళ్ళే కొరికేసుకున్నట్టు ఉబ్బి వున్నాయి.

వాళ్ళ చెవులు యెవరో రాక్షసులు చెవులు తీసుకు వచ్చి అతికించినట్టు పెద్దవిగా వున్నాయి.

వాళ్ళ బట్టలకి రక్తం మరకలు లేచినోట చీము మరక లున్నాయి.

వాళ్ళ జుత్తు అంతా పీకేసి మళ్ళీ అక్కడా అక్కడా కొంచెం వెంట్రుకలు అతికించినట్టు అతిపల్చగా వుంది.

వాళ్ళ కళ్ళముందున్న డాబ్బాలలో చిల్లర డబ్బులున్నాయి.

వేళ్ళు పూర్తిగా ఊడనివాళ్ళ చేతుల్లో కఱ్ఱ చిడతలున్నాయి.

జవాను వాళ్ళకి మందుగురించి అంతా చెప్పేడు. ఆ మందు వాళ్లని కంపెని ఉచితంగా ఇస్తుందనీ. ఆరు నెలల్లో వాళ్ళు మామూలు మనుషులైపోతారనీ, ఆ ఆర్నెల్లూ కంపెనీయే ధళ్ళని పోషిస్తుందనీకూడా చెప్పేడు.

"ఆ తర్వాత" ఆడది అడిగింది.

మధుసూదనూ, జవానూ జవాబు చెప్పలేదు. "వద్దు బాబూ. దేశంలో కూలిలేదు. కూలిపుట్టదు. ఆకలికి కాలి సావాలి. జబ్బుతోనైనా నాలుగుకాలాలు బతకనీయండి బాబూ" అంటూ వెళ్లిపోయేరు వాళ్ళు వైద్యం వద్దని.

దూరమై పోతోన్న వాళ్ళవే పేచూస్తూ నిలబడ్డాడు మధు సూదను. వాళ్ళ వెనక సూర్యుడు భగ్గుమని మండుతున్నాడు.

**(యువ దీపావళి, 10.11.1971)**

# మారాజు

**వె**న్నెల్లల్లగావుంటే రాజమ్మ వెన్నెల్లాగే వుంటుంది. నల్లగా మెరిసే రాజమ్మ వొళ్ళు–తెల్లని వెన్నెల తారులో పడి జారిపోయి నట్టున్నా– ఆ వొంట్లో మెరుపుంది. మెరుపులో అందంవుంది. అందుకే రాజమ్మ పెనివిటికి రాజమ్మంటే మక్కువుంది.

ఓరోజు పైనున్న తెల్లని వెన్నెల్ని చూస్తూ, పక్కనున్న వెన్నెల్ని దగ్గరకి లాక్కున్న పెనివింటిన్ని వారించి "మావాఁ! నీకో మంచోర్త చెప్పనా!" అంది రాజమ్మ.

"ఏటే అది?" ఆత్రంగా అడిగేడు పెనివింటి. "ఏమంటే .... ఏమంటే ... నే చెప్పను ఫో" రాజమ్మ సిగ్గుపడితే నల్లని ముఖంలో కాస్తంత సిగ్గుమెరిసి, తేనెలోకి జారిన గులాబీలా వుంది.

అప్పుడామె పెనివింటి "అదేటో చెప్పమని" బలవంతం చెయ్యలేదు. ఐదునిమిషాలాలోచించేక, నల్లవెన్నెల బుగ్గమీద ఓ చల్లని చిటికేశాడు. ఆ వేళకి వినాయకచవితి సరిగ్గా ఆర్నెల్ల మీద మరో రెండ్రోజులుంది.

❖ ❖ ❖

"మావాఁ యీడినాయకసవిత నాడుట్టేడు. యీడు గొప్పో డౌతాడు మావఁ! ఏనుగనాగే రాజాబతికీడిది" అంది రాజమ్మ వినాయక చవితినాడు.

పెనివింటి తెల్లగా నవ్వి నల్లటి పిల్ల వెన్నెలబుగ్గ మీద చల్లని ముద్దెట్టుకున్నాడు. "ఓ్రాజీ! నాకు నువ్వన్నా, సెంద్రుడన్నా, మాసెడ్డ ఇష్టం. అంచేతాడికి సెంద్రన్నని పేరెట్టుకుందాం" అన్నాడు మురిపెంగా.

చంద్రన్న వినాయకచవితి వెళ్ళిన కొన్నాళ్ళకి పాకాడ్డం నేర్చు కున్నాడు. నేర్చుకుంటూన్నప్పుడొకసారి నేల్ని కనిపించిన కండ చీమని నోట్లో పెట్టుకుంటే, అదికుట్టి వాడేడ్చినప్పుడు "ఈడు మా అయ్యలాగే మాసెడ్డ సరుకుమావాఁ" అంది రాజమ్మ వాడ్ని సముదాయిస్తూ. "ఔనే! మా గొప్ప సరుకు" అన్నవ్వేడు పెనివింటి. నవ్వి "ఆచారి మేష్టారు చేతీడిసెక్రం ఏయిద్దామే" అన్నాడు.

చంద్రన్న పుట్టిన కొన్నాళ్ళకి ఆచారి మేష్టారు వాడి జాతక చక్రం రాసేరు. రాసి– అందమైన అమ్మాయి జ్వరాన్ని డాక్టరతి జాగ్రత్తగా పరీక్షించినట్టు– చక్రాన్ని చాలాసేపు చాలా ఆసక్తిగా పరీక్షించి, "మాంచి చురుకైనవాడు, సహదేవుళ్ళాటివాడు. రాజ

యోగం ఉంది. ఏనుగెక్కుతాడే నీ కొడుకు" అన్నారాయన నవ్వుతూ. ఆ మాటలు తల్చుకొని రాజమ్మ ఎప్పుడూ మురిసి పోతూ వుంటుంది.

కండచీమని మొదట ఘనపదార్థంగా స్వీకరించిన చంద్రన్న నల్లగా దుబ్బుగా, ఏపుగా చిక్కని చిన్న నల్లవెన్నెల్లా పెరగటం ప్రారంభించాడు. వాడికి వళ్ళొచ్చేక పాలివ్వడానికేడ్చేది వాళ్ళమ్మ. నడకొచ్చేక వాడికి తగిల్నన్ని దెబ్బ లేపిల్లడికి తగిలుండవు. రాజమ్మ కెప్పుడూ ఆశ్చర్యం కలిగించే విషయమేవింటంటే. వాడు చేసిన పనుల వల్ల వాడికేదైనా దెబ్బతగిలితే కన్పించకుండా దాచుకోవడం, ఏడవకపోవడం.

చంద్రన్న, నడకకొచ్చినదగ్గర్నుండీ వాళ్ళమ్మ గేదెకి పాలు తీస్తున్నప్పుడు, ఆమెవద్ద హాజరయేవాడు గ్లాసుపట్టుకొని. ముందుగా చెంబులోకి పాలుతీస్తే ఏడ్చేవాడు, వాడి గ్లాసులోకి ముందు తియ్యలేదని. ఏకోరికా అణచుకోలేని తన కొడుకు చురుకని, తెలివైనవాడనీ, మురిసి ముద్దుపెట్టుకుంటుండేది రాజమ్మ. కాని ఆమె భర్తమాత్రం "ఈడు బతికి బాగుండడే. ఇంత సురుకుండకూడదు" అన్నప్పుడు మాత్రం బాధపడి "ఏటి మావా! సురుగ్గున్న వాళ్ళంతా సస్తారా?" అని తిరిగి ప్రశ్నించేది.

శీతాకాలంలో సాయంత్రం కళ్ళంవద్ద చలిమంట వేసుకుని రాజమ్మా, ఆమె భర్తా. చంద్రన్న, కాపలాకుక్క కూర్చున్నప్పుడు, చంద్రన్న తన తల్లి వళ్ళోనుండి గెంతి కుక్క వీపుమీదికి ఎక్క డానికి చేసే ప్రయత్నాలు,రాజమ్మ తన హృదయంలో అందంగా, అనురాగంతో దాచుకున్న విషయాలు, సాయంత్రంవేళ పొలం నుండి వస్తున్నప్పుడు తన నాలుగో ఏటనుండే ఎవర్నీ ఎత్తుకో నియ్యలేదు. తాను నడవలేదు. వాడు కోరుకున్న వాహనం వాళ్ళ గేదె. ముందు వెళుతున్న గేదెమీద కూర్చుని, వెనక వస్తున తనవేపు ఆనందం వెలుగుతున్న కళ్ళతో చూసి, తన చిన్న చేతుల్తో ఉత్సాహంగా వాడు చప్పట్లు కొడుతూ వుంటే రాజమ్మకు ఆనందంతో దిగులన్పించేది. "ఏటి మావా! యీ ఒక పశుల పిచ్చి" అనేది తనకే అర్థంకాక. "పెద్దయినాక ఏనుగెక్కుతాడో ఏటో?" అనేది భర్త మాటాడక పోవడంచూసి.

"ఎందుకెక్కడూ! నీ కొడుకేగా?" అని భర్తఅంటే సిగ్గుతో వయారంగా కుంగిపోయేది రాజమ్మ. ఆ సిగ్గుతెర వెనక లీలగా ఓ తెల్లఏనుగు, దానిమీద మైసూరు మహారాజులా స్వారీచేస్తున్న చంద్రన్న కన్పించేనా రామెకు.

పక్కవూళ్ళో రాజమ్మ తమ్ముడికి కూతురు పుట్టింది. చంద్రన్న నాలుగో ఏట "నీకు పెళ్ళాం పుట్టిందిరోయ్ సెంద్రన్నా" అంటూ పొంగిపోయింది రాజమ్మ. రెణ్ణెళ్ళు పోయేక "నీ పెళ్ళాన్ని సూద్దు గాని రారా" అని తీసుకెళ్ళింది చంద్రన్నని.

రాజమ్మ తమ్ముడు ఆప్యాయంగా "రారా అల్లుడూ" అంటూ బస్సుదిగ్గానే చంద్రన్నని ఎత్తుకున్నాడు. "ఏది మావా పెళ్ళాం?" అని అడిగేశేడు చంద్రన్న, వాడిమావ మెడని తన రెండుచేతుల్తో చుట్టేసి.

"ఓలి పెళ్ళావేయ్?" అనడిగేడు మావ అర్థంకాక.

"ఆడి పెళ్ళావేఁ అన్నా" అని రాజమ్మ అర్థం చెప్తే ఆమె తమ్ముడు"ఓరి నీ!!" అంటూ చంద్రన్నని గాల్లో పైకెగరేసి పట్టు కున్నాడు. చంద్రన్న "మరోపాలి మరోపాలి" అంటూ మారాం చేస్తే "యీడేదో గొప్పోడౌతాడే రాజమ్మా!" అన్నాడు మావఁ నవ్వుతూ.

"పెద్దయినాక ఏనుగెక్కి పట్టం కట్టుకుంటాడంటన్నా నీ అల్లుడు" అంది సగర్వంగా రాజమ్మ.

ఇల్లుచేరేక చంద్రన్నకి వాడిపెళ్ళాన్ని చూపించి, ఎత్తుకోమని వాడేమంటాడోనని ఆత్రంగా చూస్తున్నారు, అన్నా చెల్లెలూ. కానీ చంద్రన్నమాత్రం ఎత్తుకోలేదు. "ఏరా! ఎట్టాగుందిరా నీ పెళ్ళాం?" అంది రాజమ్మ మెరిసే కళ్ళతో.

"ఛా! యింత సిన్నదా?" అని నిరుత్సాహంగా అన్న చంద్రన్న మాటలకి అంతా గొల్లుమని నవ్వేరు. "ఓరినీ! నీకు పెద్దపెళ్ళాం కావాల్రా ఎదవా?" అంటూ చంద్రన్నని వాడి మావ ఎత్తుకొని గాల్లో కెగరేసి పట్టుకున్నాడు. "మరోపాలి" అని చంద్రన్న చేత మూడుసార్లు అడిగించుకుని మరీ ఎగరేశాడు మరోసారి. రాజమ్మ తన సంతోషం భరించలేక పోయింది. "అన్నా! యిప్పుడే సెపుతున్నా. నీ కూతుర్ని యారికి యీడాని కీల్లేదు" అంది ప్రతి అక్షరం వత్తిపలుకుతూ.

"అట్టాలేనే. నీ గ్గావాలంటే యిప్పుడే తీసకపోయే" అన్నాడు చంద్రన్న క్కాబోయే మావఁ.

రాజమ్మకి తారీకులు, తిదులూ తెలియకపోయినా "యినాయక సవితినాడుట్టేడు" అంటుంది రాజమ్మ చంద్రన్న వయసు గురించి. ఐదేళ్ళు వెళ్ళిన దగ్గర్నుండి గేదెని కడిగే బాధ్యత తనమీ దేసుకున్నాడు చంద్రన్న. వాళ్ళమ్మ వద్దన్నా వినకుండా వాడి

వెనకాల వాళ్ళమ్మ గాని వాళ్ళనాన్న గాని వస్తే ఏడ్చేవాడు రావద్దని. ఓనాడు మామూలు ప్రకారం గేదెని కడగడానికి తీసు కెళ్ళాడు. వాడు గేదెని తీసుకెళుతున్నప్పుడు కంగారుపడలేదు రాజమ్మ. కాని వాడు కాలువ నుండి తిరిగివస్తున్నప్పుడు మాత్రం ఏడుస్తూ వాడికెదురు పరుగెత్తింది. చచ్చిన పాముతో గేదెని తోల్తున్న వాడి చేతిలోని పామును విసిరేసి, వాడిని గట్టిగా గుండెలకు హత్తుకుంది. కొంత తేరుకున్నాక "ఇదేం పనిరా" అని మాత్రం అనగల్గింది. భయంతోను, ఆందోళనతోను ఆమె గొంతు పూడుకుపోయింది. వాడికేం అర్థం కాలేదు. ఏ పని గురించి అడుగుతోందో, ఎందుకేడుస్తోందో అసలర్థంకాలేదు. అంచేత ఏంమాట్లాడలేదు వాడు.

"ఎందిరా సెంద్రిగా! పాముని పట్టుకున్నావ్! కుడితే సావ్వంట్రా" అంది వాడి కర్థం అయ్యేటట్టు.

"సచ్చిందే గందే" అని సముదాయించేదు వాడు వాళ్ళమ్మని.

రాజమ్మ కారాత్రి నిద్రపట్టలేదు. కొడుకు చురుకని సంతో షించే ఆమెకు, ఆ చురుకుతనమే శాపంలా అన్పించింది. అర్థ రాత్రయినా నిద్రపట్టలేదు, సరికదా గుండెల్లో దిగులెక్కువైంది. చెప్పలేని భయం ఆమెని లొంగదీసుకుంది.

చంద్రన్న గురించి – ఏదో చెప్పలేని ఆరాటం. వాడు బతికి బాగుపడాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

వాడి ప్రాణానికి అప్పుడే ఏదో ముప్పు కలిగినట్లుగా వాడి పక్కలో పడుకుని, వాడ్ని దగ్గరగా తీసుకుంది. కాని ఏదో అర్థం కాని విచారంతో కళ్ళలో నీళ్ళు తిరిగే యామెకి.

ఈలోగా లేచిన ఆమె భర్త "యింకా నిద్దర్నేదే నువ్వు?" అంటూ సహం నిద్రలోనే పలకరించేదు.

"నిద్దర్రానేదు మావా" అంది రాజమ్మ కన్నీళ్ళొత్తుకుంటూ.

"యిప్పుదేందే నీ బాధ?" ఆనడిగేడు మావ.

"ఇందాక పావుని తల్చుకుంటే బయవేస్తోంది మావా" అంది గొంతుకలో ఆతృత కనపడకుండా.

"ఇప్పుడేం గానేదుగ దే, తొంగో" అంటూ రెండో వేపు తిరిగే డా మావ.

"అదిగాదు మావా. యీ డెప్పుడూ యింతే బయవేనేదసలు. మొన్నోపాలి తేలొస్తే యిట్టాగె సెప్పుతో సంపీనాడు" అని ఆమె యింకా తనబాధ వెళ్ళబోసుకోపోతే, ఆమె మావ అడ్డొచ్చి "ఆడు సంపడంలో అంతా మీ అయ్యపోల్తేనే. పర్వానేదు. తొంగో" అంటూ తాను తొంగున్నాడు.

విషయం తెలియని కొడుకుని, తన బాధ అర్థం చేసుకోలేని భర్తని పొందిన రాజమ్మ వాళ్ళిద్దర్నీ తన జీవితంలో తొలిసారిగా తిట్టుకుంది మనసులో.

తెల్లార్లూ నిద్రలేనీ రాజమ్మ, తెల్లారకుండానే పనులన్నీ పూర్తిచేసుకుని చంద్రున్నని నిద్రలేపుతుంటే ఆమె భర్త ఆశ్చర్య పోయేదు. నాటివరకూ తాను చంద్రన్నని నిద్రలేపుతే ఒప్పుకొనేది కాదు రాజమ్మ. "పడుకోనీ మావా నేపేస్తే ఒక్కిపోతాడు" అంటూ. ఈవేళ తెల్లారకుండా రాజమ్మ వాడిని లేపేస్తుంటే "ఎందుకే యిప్పు డాడ్ని లెగ్గొడతావు?" అని అడగకుండా వుండలేకపోయేడామె భర్త.

"నీకు తెల్దు మావా ఈడ్ని బళ్లో ఏస్తేగాని నాబంలేదు" అని చంద్రన్నని లేవగొట్టి, బట్టలు తొడిగి, తాను పాలచెంబు పట్టుకుని తయారయింది రాజమ్మ. "వొకీలు గోరింట్లో పాలి చ్చేసి, ఈణ్ని బళ్ళో వొదేసి ఒచ్చేస్తామావా నీ వీడనేవుండు" అని భర్తతో అని, "అయ్యకి దణ్ణంవెఁట్టరా ఎదవా" అని చంద్రన్నచేత వాడి తండ్రికి నమస్కారం పెట్టించి తీసికెళ్ళి పోయింది. తన తండ్రి పోల్తి అని, తండ్రి పేరని చంద్రన్నని ఎప్పుడూ తిట్టని రాజమ్మ యీనాడు "ఎదవా" అని తిడితే, చంద్రన్న భయపడ్డాడు. వాడి తండ్రి ఆశ్చర్యపోయేదు.

చంద్రన్న చదువు సరిగ్గా పదిరోజులు సాగింది. రెండోనాడు చంద్రన్నని బడికి దిగబట్టటానికి వచ్చిన రాజమ్మతో ఆచారి మేష్టారు "నీ కొడుకు చురుకే" అన్నారు. మూడో నాడు "మా చెడ్డ చురుకు" అన్నారు. నాలుగోనాడు "మాంచి చురుకు" అన్నారు. తర్వాత కొన్నాళ్ళు "మాంఛి చురుకు" దగ్గర ఆగింది ఆచారి మేష్టారి అంచనా.

బళ్లోవేసిన ఎనిమిదవరోజున తన బలపం తోవలో పారేసు కున్నాడు చంద్రన్న. దానివల్ల వాడేం యిబ్బంది పడలేదు, వాడి పక్కన కూర్చున్న కరణం కొడుకుదగ్గర రెండు బలపాలుండబట్టి. ఇబ్బంది పడ్డదల్లా కరణం కొడుకే, వాడి దగ్గర చంద్రన్న బల వంతంగా బలపం లాక్కున్నప్పుడు.

ఆచారి మేష్టారు రాగానే, కరణం కొడుకు ఫిర్యాదు చేసేడు చంద్రన్నమీద. "వాడి బలపం తీసుకున్నావా?" అని సాధ్యమై నంత భయంకరంగా మొహంపెట్టి అడిగేరు ఆచారి మేష్టారు చంద్రన్నని.

ఔనన్నట్టు నేలవేపు చూస్తూ తలూపేడు చంద్రన్న.

"ఎందుకు తీసుకున్నావ్?" ఈమారు గొంతుకూడా భయం కరంగా వుంది.

"నాది పోనాది" అన్నాడు చంద్రన్న మేష్టారి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"నీదిపోతే వాడిది తీసుకుంటావా?" గర్జించేరు మేష్టారు.

చంద్రన్నకి తన బలపం పోయినప్పుడు, కరణం కొడుకు దగ్గరవున్న రెండింటిలోనూ ఒకటి, కరణం కొడుక్కి యిష్టమున్నా లేకపోయినా తీసుకోవడంలో తప్పు కనిపించలేదు. మేష్టారు వేసిన ప్రశ్నకు "తీసుకుంటాను" అన్నట్టు తలూపేడు.

మేస్టారుకి అమ్మవారు పూనింది.

"ఇలా రా" అరిచేరు.

చంద్రన్న అమాయకంగా వెళ్ళేడు.

"చెయ్యి చాపు".

చాపేడు చంద్రన్న.

మేష్టారుడ్రాయరులోంచి బెత్తం తీసి చంద్రన్న చేతి మీద ఒకటి కొట్టాడు.

నిర్భయంగా స్వీకరించాడు చంద్రన్న.

చంద్రన్న ఏడుస్తాడేమోనని ఆశించిన మేష్టారుకి, వాడేడవక పోవడం చూసి ఆశ్చర్యం, వాడు దెబ్బ తింటున్న ప్పుడు కూడా కళ్ళు మూయక పోవడం చూసి భయం కలిగేయి.

"పో! నీ స్థలంలోకి" గర్జించేరు.

చంద్రన్న తనస్తలంలోకి వెళ్ళిపోయాడు.

"వాడి బలపం వాడికిచ్చెయ్" ఆజ్ఞాపించాడు మేష్టారు. ఒక్క క్షణం చంద్రన్న యివ్వలేదు. కరణం కొడుక్కి ఒక బలపం వుండనే ఉంది. తన వద్ద బలపం లేదు. అటువంటప్పుడు కరణం కొడుక్కి తిరిగి బలపం ఎందుకు యిచ్చెయ్యాలో చంద్రన్నకి అర్థం కాలేదు. ఓ క్షణం అయ్యేక యిచ్చేశాడు, బహుశా పెద్దయ్యేక అర్థం అవుతుందనుకుంటా.

"యిలారా" మళ్ళీ గర్జించేరు మాష్టారు మళ్ళీ వెళ్లేడు చంద్రన్న. మేష్టారు అడగకుండానే చెయ్యి చాపేడు, ఎలాగా మళ్ళీ కొడతారు గదా అని. కాని మేష్టారు కొట్టలేదు. తన డ్రాయరులోంచి బలపం తీసి వాడి చాపిన చేతిలో పెట్టేరు. చాపని చేతిలో వున్న పలక తీసుకొని దాని మీద 'ఋ, ౠ' అన్న అక్షరాలు రాసి, వాటి ఉచ్చారణ చెప్పి, దిద్దమన్నారు. వాటి ఉచ్చారణ సమంగా అర్థం అవలేదు చంద్రన్నకి. కాని అదే అర్థం అవుతుందన్న నమ్మకంతో దిద్దుతున్నవాడు "ఆ చేత్తో కాదు, కుడిచేత్తో" అన్న మేష్టారి పెడబొబ్బకి జడిసి పోయేడు. చంద్రన్న వామహస్తుడు. ఎడం చేతికి లొంగని యీ 'ఋ, ౠ' అని తన కుడిచెయ్యి బలపాన్ని ఇన్ని వంకలు తిప్పలేదని చంద్రన్నకి దిద్దకుండానే తెలుసు. అంచేత మరి వాడా ప్రయత్నం చెయ్యలేదు.

మేష్టారు మూడుసార్లు వెర్రి అరుపులు అరిచేక చంద్రన్న కుడిచేత్తో బలపం పట్టుకున్నాడు. కొత్త పూజారత్వంలా వుంది వాడిపని. మేష్టారు రాసిన అక్షరాల మీద తప్పించి మిగతా పలక మీద బీటిలో గుర్రంలా పరుగు తీస్తోంది వాడి బలపం.

కరణం కొడుక్కి బలపం తిరిగి యిప్పించేసి నందుకు వాడు మెచ్చుకోలేదు. మేష్టారు కొట్టినందుకు విచారించలేదు. కుడిచేత్తో అక్షరాలు దిద్దమన్నప్పుడు మాత్రం చాలా బాధనిపించింది వాడికి. ఈలోగా ఒంటేలు బెల్లు కొట్టేరు. పిల్లలంతా స్కూలుపక్క మైదానంలో పరిగెత్తుకు పోయేరు. వాడింటికి పారిపోయేడు చంద్రన్న.

పొలం నుండి రాజమ్మ యిల్లు చేరేసరికి యింట్లో వున్నాడు చంద్రన్న. స్కూలు ఎగ్గొట్టేడని గ్రహించిన రాజమ్మ, మధ్యాహ్నం తనే స్వయంగా స్కూలుకి తీసి కెళ్ళింది మేష్టారికప్పగిద్దామని, కాని మేష్టారొచ్చే వరకూ స్కూల్లోనే వుండమని, కదిలితేవీపు చీరేస్తారని చంద్రన్నతో చెప్పి వెళ్ళిపోయింది.

కదలకపోతే మేష్టారు వీపు చీరేస్తారని చంద్రన్నకి తెలుసు. ఈవేళ ఎలాగూ వీపు చీరుకుపోవడం తధ్యం కాబట్టి, మేష్టారు చేత చీరించుకుందామని చంద్రన్న స్కూల్లోనే వుండి పోయేడు. వాళ్ళమ్మచేత దెబ్బలు తినడం వాడికిష్టంలేదు.

మెరుస్తున్న నామాల్తో వచ్చిన ఆచారిమేష్టారు సాక్షాత్తు యమ భటుడిలా కన్పించేరు చంద్రన్న కళ్ళకి. మేష్టారు వస్తూనే వాడి రెండు చేతులూ తన ఎడంచేత్తో పట్టుకుని టేబిలు దగ్గరికి లాక్కెళ్ళారు. కుడిచేత్తో డ్రాయరు తీస్తూనే అడిగేరు "పొద్దుట ఎందుకు పారిపోయావని."

చంద్రన్న చెప్పలేదు

మేష్టారు డ్రాయరులోంచి బెత్తంతీసి, వాడి వీపుమీద గట్టిగా రెండుసార్లు కొట్టేరు. వాడు ఏడవకపోవడం చేసి యింకా రెచ్చి

పోయేరు. నామాలూ కళ్ళూ ఒక్కలా మెరిసిపోతున్నాయి. యమ భటుని నుంచి యముడికి ప్రమోషనువచ్చి నట్టున్నారు.

మూడోసారి యింకా గట్టిగా బాదేరు.

మూడోదెబ్బ పడగానే కేవ్వుమని కేక మేష్టారు వెయ్యడం, చంద్రన్న తన పలకకూడా తీసుకోకుండా పారిపోవడం, మేష్టారి చేతివేలునుండి రక్తం కారడం ఒక్కసారి చూశేరు మిగతా పిల్లలు.

అలా పారిపోయిన చంద్రన్న స్కూలు టైము అయ్యే వరకు యిల్లు చేరలేదు. మిగతా పిల్లలు యిల్లు చేరేటైముకి వచ్చిన చంద్రన్నని చూసి మురిసిపోయింది రాజమ్మ. ప్రొద్దున్న బడి ఎగ్గొట్టినందుకు మేస్టారు తిట్టారేమోనన్న ఆలోచన రాగానే బాధపడి "రారా సెంద్రిగా" అని ఎత్తుకోబోయింది. అమ్మ ఎత్తు కుంటే వాడికి ఎప్పుడూ ఎంతో బాగుంటుంది. కాని యిప్పుడేం బాగులేదు. ఎత్తుకున్నప్పుడామె చేతులు వాడి వీపుమీద దెబ్బలకు తగిలి, బాధ దిగమింగలేక "అమ్మో" అని కళ్ళుమూసుకున్నాడు.

"ఏటిరా, ఏటిరా?" అంటూ దింపేసింది వాడివేపు ఆత్రంగా చూస్తూ. వాడు మాట్లాడలేదు. ఏం జరిగిందని అడిగినా చెప్ప లేదు. చేసేదిలేక వూరుకుని, వాడికి నీళ్ళుపొయ్యటానికి పెరట్లోకి తీసుకెళ్ళింది. వాడి లాల్చి విప్పగానే, వాడి నల్లటి వీపుమీద యింకా నల్లగావున్న మూడు తట్లు చూసిన తనని ఎవరో కొరడాతో కొట్టినట్టు బాధపడింది.

"మేస్టారు కొట్టారా?" అనడిగింది.

వాడు మాట్లాడలేదు.

"పిల్లలు కొట్టారా?"

ఐనా మాట్లాడలేదు చంద్రన్న.

ఏం చేసేదిలేక తనలోతానే కుమిలిపోయింది రాజమ్మ. ఆ రాత్రి చంద్రన్నని పక్కలో వేసుకుని, వాడు నిద్రపోయాక కూడా వాడిమీదకు వంగి వాడి మొహంలోకి చాలాసేపు చూస్తూ వుండిపోయిందామె. "ఏ ముదనష్టపోడుకి సేతులొచ్చాయో పసో ణ్నిలా కొట్టడానికి" అనుకుంటూ వుంటే, ఆమె కన్నీటిబొట్లు వాడి బుగ్గమీదపడి దీపంబుడ్డి వెలుతురిలో వజ్రంలా మెరిసి పోయింది. ఆ కన్నీటిచుక్కని తుడవకుండానే వాడి పక్కన వాలి పోయింది రాజమ్మ.

మర్నాడుదయం చంద్రన్నని తీసుకుని స్కూలుకి బయల్దేరింది రాజమ్మ. మేస్టారే కొట్టివుంటే "నీ చేతులు పడిపోనూ" అని తిట్టి తిరిగి తీసుకొచ్చేద్దామనుకుంది చంద్రన్నని. పిల్లలే కొట్టి వుంటే "అప్పుడు నువ్వేటి సేత్తున్నావయ్యగోరూ?" అని అడిగేద్దా మనుకుంది. కాని వీటివేటికి అవకాశం యివ్వలే దాచారి మేష్టారు. రాజమ్మని, చంద్రన్నని చూడగానే వాళ్ళవైపే నడిచి వస్తూ, "దావే తల్లీ! దా! నేనే వద్దామనుకుంటున్నా నీకోసం, చూడవే! చూడు నీ కొడుకేం చేశాడో!" అంటూ చిలక ముక్కులా వంగివున్న తన ఎడమ చేతి చూపుడువేలు రాజమ్మ మొహం ముందు పెట్టేరు. చూడ్డానికి అచ్చు చిలక ముక్కులాగే వుంది ఎర్రగా. కాని చిలక ముక్కులాగా లేక గంట్లుతో గరుగ్గా వాచి పోయింది. రాజమ్మకి తన పరీక్షకి సరిపోయే టైమిచ్చి "తల్లీ, మనిషి కాటుకి మందు లేదు. పక్షం తిరక్కుండానే చస్తాను" అన్నాడు ఆచారి మేష్టారు. ఆయన మేష్టరీకి ముందు వైద్యం చేశేవారు.

ఆచార్ని చంపేద్దామనివచ్చిన రాజమ్మకు, ఆచారే తన్ని చంపినట్టయి మాటాళ్ళేదు. ఆమె మౌనంచూచి ఆచారి రెచ్చి పోయి "వాడు బడికొస్తే నేను బడికి తాళం వేసేస్తాను. బళ్ళో యిద్దరం ఉండటానికి వీల్లేదు" అన్నారు.

రాజమ్మేవీఁ మాట్లాకుండా చంద్రన్నని తీసుకొని వచ్చిన దారినే వెళ్ళిపోయింది. "అయ్యగోరు మాట పెకారం సస్తే బావుణ్ను" అనుకుంటూ, చంద్రన్న చదివి పెద్దవాడై ఏనుగెక్కి పట్టం కట్టుకుంటాడన్న ఆశ అడుగంటిపోయింది రాజమ్మకి. ఊర్నించి తిరిగొచ్చిన భర్త చంద్రన్నని యింట్లో చూసి "బడికి పంపనేదేం?" అని అడిగినప్పుడు, "ఆ అయ్యావా రొట్టి పశువు మావా. బొట్టుణ్ని గొడ్డుని బాదినట్టు బాదేడు. నానే మానిపించేసి నాను బడి" అంది రాజమ్మ.

చంద్రన్న చదువుకోలేదన్న బాధ వాడి తల్లిదండ్రుల కెన్నడూ లేదు. వాణ్ని బళ్లో వెయ్యకముందోసారి వాడితండ్రి "ఈణ్ని బళ్ళో ఏస్తే బావుణ్ణే" అంటే "ఈడికి చదువునేకపోతే నేంలే మావా? ఉద్దోగం సెయ్యాలా? ఊళ్ళేలాలా? మనకున్న దాడికి సాల్దా" అనేసింది రాజమ్మ. ఆమె భర్తకూడా "నీ యిష్టం" అనూ రుకున్నాడు.

చంద్రన చచ్చిన పాముల్తోనూ, బతికిన తేళ్ళతోను ఆడ కుండా వుండాలని వాళ్ళమ్మ బళ్ళో వేస్తే, ఆచారిమేష్టారికి పాము కరిచినకంటె ఎక్కువ భయంవేయడం వల్ల చంద్రన్న చదువాగి పోయింది.

చదువు మానేసిన చంద్రన్న పదిరోజుల పాటు కాలం దివానీ రాజుగారి తెల్ల గుర్రంలా దౌడుదీసింది. కాని తర్వాత అకస్మాత్తుగా ఆగిపోయినట్టనిపించింది. గోకినచోట గడ్డి గోకడం, తీసుకెళ్ళిన కాలువకే గేదెని తీసుకెళ్ళడం, ఎక్కిన చెట్లే ఎక్కడం విసుగుపుట్టింది వాడికి.

విసుగుపుట్టిన చంద్రన్న ఒక మధ్యాహ్నం ఆలోచించేడు, వాళ్ళనాన్న చుట్ట ఎందుకు కాలుస్తాడా అని. వాళ్ళమ్మ ఎందుకు కాల్చదా అన్న ఆలోచనకూడా స్ఫురించింది వాడికి. చుట్టల విషయంలో వాడికి తెలిసిన ఆడ, మగ అందరి గురించి బుర్ర వేడెక్కేవరకూ ఆలోచించేడు. ఓట్లన్నీ మగాళ్ళకే పడ్డాయి వాడి అంచనాలో. మగాడయ్యాక చుట్ట కాల్చాలనుకున్నాడు. చుట్ట కాల్చకపోతే మగాడే కాడనుకున్నాడు.

అనుకున్నాక ఆలస్యం చెయ్యకుండా గూట్లో వున్నవాడి తండ్రి చుట్ట, అగ్గిపెట్టే తీసి పెరట్లోకి వెళ్ళేక చుట్టంటించడం రెండు దమ్ములాగడం అస్పష్టంగా జ్ఞాపకం వున్నాయి. తర్వాతేం జరిగిందో ఏం జ్ఞాపకం లేదు. కాని తెలివొచ్చేసరికి కంట తడి పెట్టుకున్న తన తల్లి వడిలో తానుండడం, తన తండ్రి పక్కనే కూర్చుని "నా సుట్టముక్కలకే డబ్బుల్లేక సత్తా వుంటే ఈడొకడా నా మీదికి" అనడం మాత్రం గుర్తుంది.

ఆ మర్నాడు రాజమ్మ వాడితో "ఈ పాలి సుట్టూసుకెల్లేవంటే యీపు సీరేస్తా" నంది. తన నల్లని వీపంటేచంద్రన్నకి అమితమైన అభిమానం, అంచేత మళ్ళా చుట్టూసుకిపోలేదు వాడు.

ఆ తర్వాత చంద్రన్నకి కాలం స్థంభించి పోయినట్టనిపించింది. ఊసుపోవడం మానేసింది. చిన్నప్పటినుండీ పశువులూ, జంతువాహనాలూ అంటే సరదా వుండడం వల్ల వాడి ఆలోచన వాటిమీదికి పోయింది. వాడి దృష్టిని పక్కవీధిలో నున్న చాకలాడి గాడిదా, దాని పిల్లా ఆకర్షించేయి. గాడిదపిల్ల ఎంచక్కా బొచ్చు కుక్కపిల్లలా ముద్దొస్తూవుంది. గాడిదని చూస్తే దానిమీద సవారీ చేసేవరకూ వాడి ప్రాణం వుండబట్టలేదు. సవారీ నాశించి, వాడు చాకలితో స్నేహం పట్టేడు. స్నేహం వారంరోజులు ముదిరేక చంద్రన్న తన కోరిక చాకలికి వ్యక్తం చేశాడు. చాకలి చంద్రన్న కోరిక మన్నించి, తన గాడిదమీద రెండువైపులా మాసిన బట్టలు మూటలు వ్రేలాడదీసి, మధ్యన చంద్రన్నని ఎక్కించి రేవుకి దారితీసేడు. వీధి మళ్లేవరకు గాడిద పరధ్యానంగా నడిచింది. చంద్రన్నకు ఆకాశంలో తేలిపోతున్నంత, మబ్బు అంచునా ప్రయాణం చేస్తున్నంత ఆనందం కలిగింది.

గాడిదా, చంద్రన్నా, చాకలీ వీధి మలుపు తిరిగేరు. ఎదురుగా వందగజాల్లో దేవాలయం కన్పిస్తోంది. ఆలయం చూడగానే చంద్రన్నలోనూ, చాకలిలోనూ యెటువంటి మార్పూ రాలేదు కాని, గాడిదలో మాత్రం అకస్మాత్తుగా బ్రహ్మాండమైన మార్పొచ్చింది. దానిలో ఒకవిధమైన వికారం ఆవేశం వచ్చేయి. అందుకు నిదర్శనంగా అది ఒక్కసారి గట్టిగా ఓండ్ర పెట్టి ఆలయంవైపు దౌడు తీసింది. చంద్రన్నకి ఒక్కసారి భయం వేసింది. నవనాళ్ళూ బిగించి పడిపోకుండా గాడిద మెడమీదున్న జూలు గట్టిగా పట్టుకున్నాడు. పోటీ చేసినట్టు పడుగెడుతోంది గాడిద. దాంతో పోటీగా పరుగెడుతున్నాడు దాని యజమాని. కాని ఆలయం చేరడంలో దాన్దే పై చేయి అయింది. ఆలయం చేరేక ఆలయంలో తాలూకు ప్రహరీగోడ ప్రక్కనాగి, వెనక తన యజమానెంతనకుండటం వున్నాడో చూసింది. వాడింకా పాతిగ్గజాలు దూరంలోనే దానికి సంతృప్తి నిచ్చింది. వాడు చేరుకునేలోగానే మన పని కావాలని, తనపక్కని గోడకేసి రాయడం మొదలెట్టింది. గాడిద ఆగినందుకు సంతోషించేడు చంద్రన్న. అది గోడకేసి వీపు గొక్కుంటే మామూలు పరిస్థితుల్లో ఐతే వాడికేం అభ్యంతరం వుండదు, కాని ప్రస్తుతం దానికీ, గోడకీ మధ్య కాలుండడం వల్ల పెద్ద అభ్యంతరవేఁవుంది. వాడి కాలు చెక్కుకుపోయి రక్తం చిమ్ముతోంది. ఆచారి మేష్టార్ని తప్పించుకున్నాక, మళ్ళీ మొదటిసారి చంద్రన్నకి గాడిదలో ఆచారి మేస్టారు కనపించేరు. గాడిదని ఆగమని ఎలా చెప్పాలో వాడి కర్థంకాలేదు. ఒక్కసారి గట్టిగా ఘొల్లుమన్నాడు. గాడిద వాడ్ని పూర్తిగా అపార్థం చేసుకుంది. ఇంకా గోడకి రాయడం ప్రారంభించింది.

ఈలోగా భగవంతుడు చాకలి రూపంలోవచ్చి చంద్రన్నకి ప్రాణదానం చేసేడు. వాడు గాడిద చెవులు పట్టుకోగానే అది మీటనొక్కి నట్టాగిపోయింది. అంత బాధతోనూ కూడా చంద్రన్న ఈ విషయం గమనించేడు.

"ఇంకా నయ్యం! బట్టమూట వుండబట్టి సరిపోయింది కాని నేకపోతేనా...." అంటూ చాకలి చంద్రన్నని దింపి యింటికి దిగబెట్టేడు.

చంద్రన్నని చూసిన రాజమ్మకు దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది. విషయం తెలిసేక చాకల్ని యిటేడుతరాలు అటేడు తరాలు తిట్టిపోసింది. ప్రపంచంలో వున్న గాడిదలన్నీ సర్వ

నాశనం అయిపోవాలని శపించింది. "గాడి దెక్కొద్దురా శంద్రిగా, నీ క్కాలవాంటే గుర్రంకొని పెడతాన"ని వాగ్దానం చేసింది. గాడిదవల్ల కలిగిన కీడు పోవడానికి పదిహేను రోజులు పట్టింది. పూర్తిగా చెక్కుపోయిన చంద్రన్న కాలు మళ్ళీ మామూలుగా నల్లగా నిగనిగలాడుతూ అయి పోయింది. మామూలుగా అవన్నీ వాడి మనసే వాడి అమ్మ గుర్రాన్ని గురించి చెప్పినప్పుడే, వాడు గుర్రాన్నెలాగైనా యెక్కాలని నిశ్చయించుకున్నాడు.

నిశ్చయం వుండి, గుర్రం లేకపోవడం వాడికెంతో నష్టం కల్గించింది. రాజమ్మ గుర్రాన్ని కొననందుకూ, మాట నిలబెట్టు కోనందుకూ చాలా బాధపడ్డాడు. ఆ విషయం రాజమ్మకు తెలియ చెప్పేదుకూడా. రాజమ్మ నవ్వేసారేసింది. "పోనీ గుర్రప్పిల్లనైనా కొను, మేపుకుంటాన"ని మారాం చేశేడు. "నీ పెళ్ళికి కొంటా న్నేరా. అప్పుడు కావాలంటే ఏనుగే కొంటాన్లే" అంది రాజమ్మ నవ్వుతూ. "మావఁకూతురుగుంట పెద్దదవడమెప్పుడు! పెళ్ళ వడమెప్పుడూ!" అని మనసులోనే కుంగిపోయేడు చంద్రన్న.

అలా కృంగిపోయిన చంద్రన్నకి ఒకనాడు పొద్దున్నే లేవగానే తన పక్కింటి ముందు కట్టేసివున్న గుర్రాన్ని చూసేసరికి ప్రాణం లేచొచ్చినట్టయింది. మరో గంటలో ఆ గుర్రం కరీం సాయిబు దనీ, సాయిబు జట్కాతోల్తాడనీ, జట్కా వీధి చివర రావిచెట్టుకింద కట్టేడనీ, తమ పక్కింట్లోనే కొత్తగా అద్దెకు దిగాడనీ వివరాలు సేకరించేడు చంద్రన్న. ఆనాడే ఆరంభమైంది సాయిబు దగ్గిర శుశ్రూష. కేవలం సాయిబుకి అసిస్టెంటే ఐపోయాడు. సాయి బుకి బీడీలు తేవడం దగ్గరనుండి సాయంత్రం గుర్రానికి ఉడుకు నీళ్ళు పోయడం వరకు అన్నిట్లోను సాయపడేవాడు. వాళ్ళిద్దరి మధ్యా మైత్రి పెరిగిపోయింది. సాయిబుక్కూడా పిల్లలు లేక పోవడంవల్ల చంద్రన్నంటే అభిమానం పెరిగింది. చంద్రన్నకి రోజూ పకోడీల పొట్లం తెచ్చేవాడు సాయిబు. సాయిబు గుర్రానికి తన పొలంలోని పచ్చగడ్డి గోకితెచ్చేవాడు చంద్రన్న.

వాళ్ళ స్నేహం బాగా ముదిరేక చంద్రన్న సాయిబుని గుర్రాన్నె క్కించమని కోరేడు. "సవారి గుర్రంకాదు. నడ్డిరుగుద్ది, ఎక్కిం చకు" అని చంద్రన్న తండ్రి చెప్పినా వినకుండా సాయిబు చంద్రన్నని గుర్రంమీద ఎక్కించి, వీధి చివర జట్కా బండివరకూ తీసుకెళ్ళాడు. ఇలా వారం రోజులు జరిగింది. మొదటిరోజు గుర్రం ఎక్కినప్పుడు ఏనుగెక్కినట్టయింది చంద్రన్నకి. సంతో షంతో వాడి హృదయం పొంగిపోయింది. లాల్చీలేకుండా కేవలం నిక్కరుతో మాత్రం గుర్రంమీదున్న వాడి నల్లటి ఒళ్ళు లేత ఎండలో నిగనిగ మెరిసిపోతూవుంటే చూసిన రాజమ్మకు గర్వం, ఆనందం ఒకేసారి కల్గేయి. నలుపైనా అందగాడనే చెప్పాలి చంద్రన్న. ఆరోగ్యంతో వాడి ఒళ్ళు, ఆనందంతో వాడి కళ్ళు ఎప్పుడూ మెరుస్తూ వుంటాయి. పెద్ద కళ్ళు, కంటినిండుగా నల్లటిగుడ్లూ, ఎత్తయిన ముక్కూ, చిన్ననోరూ, దట్టమైన నల్లటి జుట్టు వాడి ఆకర్షణలు. ఇలాటోడ్ని ఒక్కణ్ని కంటే సాల్ను" అను కుని గర్వపడింది రాజమ్మ తన మామూలు ప్రకారం.

రెండోనాడు గుర్రం ఎక్కినప్పుడు కూడా సంబర పడ్డాడు చంద్రన్న. మూడోనాడు మెత్తగా లేనట్టనిపిం చింది. నాలుగో నాడు దాని ఎముకలు గుచ్చుకున్నట్ట నిపించేయి. అదసలె జట్కా గుర్రం. రిక్షాలొచ్చేక దాని పరిస్థితి మరీ అధ్వాన్నమై పోయింది. గాడిదని పక్కన నిలబెట్టినప్పుడు మాత్రమే దాన్ని గుర్రంగా పోల్చుకోవచ్చును. చిరిగిపోయిన వెదురుబుట్టకు చర్మం తొడిగినట్టుంది దాని శరీరం. వీపుపై నున్న కురుపుమీద వాలే యీగల్ని తోలుకోడానికి సరిపోని తన పొట్టి తోకని చికా కుగా అటూ ఇటూ ఆడిస్తూ, భారంగా జట్కాని లాగుతూ, యింకా భారంగా దినాలు గడుపుతూ భగవంతుడి పిలుపుకోసం సదా కన్నీటితో ఎదురు చూస్తున్నట్టుంటుందది.

ఇంత అర్థం చేసుకోలేకపోయినా, స్వారి ఆరంభించిన వారం రోజులకి, ఆ గుర్రం ఎక్కడంలో ఆనందంలేనట్టు గ్రహించేడు చంద్రన్న. తర్వాత తొక్కిపీకేసినా పరుగులో గుర్రకంటే చాకలాడి గాడిదే నయమనిపించి గుర్రపు స్వారీ మానేశాడు.

❖ ❖ ❖

స్వారీ మానేసిన కొంతకాలం హడావిడిగానే నడిచింది చంద్రన్నకి. వరికోతలూ, సంక్రాంతి పండుగ కాబట్టి ఈలోగా వచ్చించి వాళ్ళూ రొక సర్కసు. సర్కసుదేరా చంద్రన్న ఇంటి పక్కనున్న మైదానంలోనే వేసేరు. సర్కసురాగానే సర్కసు వాళ్ళతో కలిసిపోయేడు చంద్రన్న. ఉండవలసిన అన్ని హంగులూ వున్నాయా సర్కసుకి. అందం లేకుండా, కేవలం లైట్లు వెలుగుతో అందంగా కన్పించే అమ్మాయిలు, శాండోలు, గళ్ళపరుపు గుడ్డలు కట్టుకున్న బఫూన్లు, గుర్రాలు, పులులూ, సింహాలూ అన్నీ వున్నాయి. అన్నిటినీ మించి వున్నాయ్ ఏనుగులు.

మొదట్నించీ జంతువులంటే సరదావున్న చంద్రన్నకి దుర్మా ర్గంగా కన్పించే పెద్దపులులు నచ్చలేదు. విగ్గు పెట్టుకున్న వీధి

కుక్కల్లా వున్నాయి సింహాలు. చంద్రన్న మనసుకి విపరీతంగా నచ్చినవి ఏనుగులు. అన్నిటికంటె బాగా నచ్చింది పిల్ల సైజులో వున్న ఓ ఏనుగు.

సర్కసు వచ్చిన మర్నాడే ఏనుగుల్ని కడగడానికి తీసుకెళ్ళేరు మావటీలు. అసలు ఏనుగెక్కడంలోనే వుంది గమ్మత్తని పించింది చంద్రన్నకి. ఏనుగువంగితే దాని కాలుపట్టుకొని ఎక్కేడొకడు. మరొకడ్ని ఏనుగ తొండంతో వీపుమీద కూర్చోపెట్టుకుంది. మనిషొక రకంగా ఎక్కేరు ఏనుగులు. పైకి అంతా ఎక్కేక బయ ల్దేరేయి ఏనుగులు స్నానానికి. అవి స్నానం చెయ్యటం మరీ గమ్మత్తనిపించింది చంద్రన్నకి. తొండాలతో అవి తమ శరీరాలు తడుపుకుంటూ వుంటే, చిన్న ఏనుగ మధ్య మధ్య పెద్ద ఏనుగుల మీద తొండంతో నీళ్ళు జల్లుతూంటే చంద్రన్నకి ఆనందంతో తనగుండె పగిలిపోతుందనిపించింది.

ఎక్కితే ఏనుగే ఎక్కాలనుకున్నాడు చంద్రన్న. ఏనుగెక్కని వాడి జన్మ ఎందుకని కూడా అనుకున్నాడు. కొండంత ఏనుగెక్కి గాలిలో ఊగుతూ స్వారి చేస్తున్న మావటివాణ్ణి చూసి యీర్ష్య పడ్డాడు. ఎలాగైనా ఏనుగెక్కాలని నిశ్చయించుకున్న చంద్రన్న సర్కసు వాళ్ళతో స్నేహం పట్టాడు. వాళ్ళు కూడా వాడి స్నేహం అంగీకరించి, వాడిచేత బీడీలు, కాఫీలు తెప్పించుకునే వారు. జంతువుల్ని కట్టిన స్థలాన్ని బాగుచెయ్యడంలో వాడిని కూడా సాయం చెయ్యనిచ్చే వారు. అదే మహాభాగ్యమనుకొన్నాడు చంద్రన్న. తుడుస్తున్నప్పుడు ఏనుగులు దగ్గరగా వెళ్ళి వాటిని తాకేవాడు. రోజూ తన పొలంన ుండి నాలుగు చెరుకు గెడలు విరుచు కొచ్చి ఏనుగులకి లంచం పెట్టేవాడు. ప్రతిరోజూ సర్కసు లోకి టిక్కెట్టు లేకుండా రానిచ్చేవారు చంద్రన్నని. కాని వాడు ఏనుగుల ఫీట్సుకోసం రానిచ్చేవారు చంద్రనన్నని. కాని వాడు ఏనుగుల ఫీట్సుకోసం మిగిలిన ఫీట్సన్నీ చూడాల్సివచ్చేది. పెద్ద ఏనుగని చిన్న స్టూలుమీద కూర్చోపెట్టినప్పుడు, చిన్న ఏనుగని పెద్ద బంతిమీద నడిపించినప్పుడు చంద్రన్నకి కళ్ళనీళ్ళు తిరిగేవి.

వారం రోజులు హుషారుగా, జోరుగా గడిచిపోయేయి. కాని ఎనిమిదో నాడు మాత్రం వాడి గుండెల్లో రాయిపడింది, సర్కసు యింకో రెండ్రోజుల్లో వెళ్ళిపోతుందని తెలియగానే, ఏనుగులని చూసిననాడే నిర్ణయించుకున్నాడు, వాడు వాట్లో ఓ దానిమీదెక్కడానికి. కాని గాడిద, గుర్రం ఎక్కినంత సుళువుగా లేదు ఏనుగెక్కడం, చాకలీ, సాయిబు అడగ్గానే ఎక్కించేరు చంద్రన్నని గాడిదమీద, గుర్రంమీద. కాని యీ సర్కసు మళయాళం వాళ్ళంత సుళువుగా లొంగలేదు. అతని చేత చాకిరీ చేయించు కోవడమేగాని, ఎంత బ్రతిమాలినా వాడిని యేనుగెక్క నివ్వడం లేదు. ప్రతిరోజూ చెరువుదగ్గ రెక్కిస్తామని వాడిని యేనుగుల వెనకాలే చెరువుకి తీసుకెళ్ళేవారు చెరువుకెళ్ళేక, టెంట్ దగ్గరెక్కిస్తా మని తిరిగి వెనకాలే తీసుకొచ్చేవారు.

సర్కసు వెళ్ళిపోతుందని విన్ననాడు చంద్రన్న ఆఖరి పర్యా యంగా పిల్ల ఏనుగెక్కే ముసలి మావటీని తనని కూడా ఎక్కిం చమని అడిగేశాడు. వాడు మామూలు ప్రకారమే చెరువు దగ్గరకు రమ్మన్నాడు. కాని చంద్రన్న వెళ్ళలేదు. ఇంటి కెళ్ళిపోయి బుర్ర వెడెక్కేవరకు ఆలోచించేడు. ఆ తర్వాత మళ్ళా సర్కసుడేరా దగ్గర కెళ్ళలేదు.

మరో రెండురోజులు గడిచిపోయేయి. రాత్రి నల్లగా దయ్యంలా ప్రపంచాన్ని పట్టుకుంది. ఆ రాత్రి సర్కసు ఆటలేదు. మర్నాడు పొద్దున్నే సర్కాసు వెళ్ళిపోయింది. దూరాన సబ్‌జైల్లో నిద్రపోతున్న వార్డరు ఒంటిగంటయ్యేక లేచి పన్నెండు గంటలు కొట్టేడు. చుట్టుపక్కలంతా నిద్రతో నిశ్శబ్దంగా వుంది. నిద్రపోనిది చంద్రన్నా, వాడెక్కుదామనుకున్న పిల్ల ఏనుగ. కోరికబలంవల్ల చంద్రన్నకి, జబ్బుచేసి పిల్ల ఏనుగకి, నిద్రరాలేదు.

తన తల్లీ, తండ్రీ నిద్రపోతున్నారని చంద్రన్నకి తెలుసు. చప్పుడు కాకుండా లేచి, పొలంనుండి తెచ్చిన నాలుగు చెరుకు గడలూ తీసుకుని సర్కసు గుడారం వైపు బైల్దేరాడు.

చిన్నగా వర్షం పడ్తోంది. అకాలం అయినా ఫ్యాక్టరీ పొగలా నల్లని మేఘాలు ఆకాశంలో సుళ్ళు తిరుగు తున్నాయి. వాటిలో కరిగిపోతున్నాడు. గుడ్డి చంద్రుడు.

దూరాన వీధికుక్క బాధగా, ఆకాశంలో వున్న దేవుడి వైపు తిరిగి ఏడుస్తోంది. మేఘాల వెనకాల దేవుడు అకారణంగా గర్జిస్తున్నాడు. ఆరోజు ఆట లేకపోవడం వల్ల సర్కసు వాళ్ళంతా సినిమాకి పోయేరు. నిద్రపోతున్న ఇద్దరు ముసలి కాపలావాళ్ళు మినహా సర్కసు దగ్గరంతా నిర్జీవంగా వుంది.

మర్నాడు ఉదయం పొద్దెక్కేవరకూ తెలివిరాని రాజమ్మ వీధిలో అలజడికి తెలివొచ్చింది. ఆమె లేవగానే ఆమె పక్కనున్న పక్కింటి ముసలమ్మ "పాతికేళ్ళయినా లేని నీ కొడుకుని ఏనుగు సంపినాదే అమ్మా!" అంటూ ఆమెను కౌగిలింకుని యేడ్చింది.

పక్కమీదనుండి లేచిన రాజమ్మ మళ్ళీ పక్కమీదే కూల బడి పోయింది.

"మారాజు" ఔతాడనుకున్న కొడుకిలా హృదయంలో చిచ్చు పెట్టి మంటకలిసి పోయేడు.

**(జయశ్రీ, 1.3.1966)**

# నల్లంచు తెల్లచీర

**"చ**చ్చిన శవంలా అలా పడుకోకపోతే కాస్త యాక్టివ్‌గా లేచి కూర్చోరాదూ?" అంది అరుణ యశోదతో మాటలతో పొడుస్తూ.

"ఆవిడగారు చచ్చిన శవం ఎందుకైందీ? విరహంలో శకుంతల్లా పోజుపెడితే" పోటు ఎక్కువ చేసింది శారద.

'నా యిష్టం! కావాలంటే ప్రేమలోపడ్డ శకుంతల్లా పాటలు పాడుకుంటా! మీ రెవరు ఆక్షేపించడానికి?" అని తిరగబడింది శవంలాంటి, విరహంలోని శకుంతలా వురఫ్ యశోద.

"కావాలంటే ప్రసవించే శకుంతల్లా పిచ్చి కేకలెయ్యి! ఎవరొద్ద న్నారు?" మరీ రెచ్చగొట్టింది అరుణ.

"ఇందాకట్నించీ చూస్తున్నా, ఎందుకమ్మా ఈ ఒక్క రోజు భాగ్యానికి అలా కరుచుకుంటారు?" సర్దిచెప్పింది రెక్కలూ, ఆలివ్‌కొమ్మా లేని శాంతిదూతలా సుందరం.

సుందరం మాటలకి అంతకుముందు అరగంటై జరుగు తున్న అనధికార యుద్ధం ఆగింది. సుందరానికి తెలుసు– వాళ్ళలా ఎందుకు గొంతు చించుకొంటున్నారో.

వాళ్ళు నలుగురూ ప్రాణస్నేహితులు. నాలుగు వేర్వేరు ఊళ్ళనుండి వచ్చి, మూడేళ్ళు వుమెన్స్ కాలేజీలో చదివి, ది సయామీస్ క్వాడ్రుప్లెట్స్(The Siamese quadruplets) అని పేరు తెచ్చుకుని, ఒకర్నొకరు జీవితంలో విడవకుండా వుందా మన్న ఆశ, తమ కళ్ళెదుటే నేటితో పగిలిపోతుందని గ్రహించేక, వాళ్ళ మనసుల నైర్మల్యం కలతపడి, ప్రతి చిన్న విషయానికీ దెబ్బలాడుకో నారంభించేరు. వాళ్ళ పరీక్షలు ఐపోయేయి. అంతా చాలా బాగా రాశేరు. ఒకర్నుంచి ఒకరు దూరమైపోతున్నా మన్న బెంగా, యిక బహుశా జీవితంలో కలుసుకోలేమేమో నన్న బాధా వారి హృదయాల్ని ఇనుప చేతుల్తోపిండి చేస్తున్నాయి. వారెవరి మధ్యా ఎటువంటి అరమరికా, భేదం ఎన్నడూలేదు. ఇతరులని ప్రేమించగల సుహృద్భావం, తమ హక్కులు మరిచి పోగల టేక్టు (Tact) మరొక బలహీనతలెడ సానుభూతీ అందరికీ వుండడంవల్ల వారిమధ్య స్నేహం జీవితాంతర బంధంగా నిలిచి పోయింది.

నలుగురూ అందగత్తెలే. నల్ల బ్లాక్ బోర్డుమీద నాలుగు వివిధ రంగుల సుద్దముక్కలతో గీసిన గీతల్లా ఎవరి అందం వారికుంది. నలుగురూ కలుసుకున్న ప్పుడు ప్రతిఒక్కరూ మరీ అందంగా కన్పిస్తారు.

ముగ్గురూ బాగా కలవారి బిడ్డలే. సవతి తల్లులూ, టీ.బీ. అన్నయ్యలూ, పీచురుగొట్టు తండ్రులూ, ఎవరికీ లేరు. జీవితం లోని బాధలు తెలియకుండా, జీవితసాగరంలో అలల మీద నాట్యం చేస్తూ జీవితమంటే ఒక రాకెండ్‌రోల్ పాటగా యింత వరకూ గడిపేశారు.

రేపే ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోవాలి. అంచేత ఆ సాయం త్రం బీచిలో సముద్రాన్ని ఆఖరుసారిగా చూస్తూ కొంతసేపు కూర్చుని, సినిమాకెళ్ళి, హాస్టలికి లేటుగా రావటానికి పూర్తి ముక్కున్న తాటకిలాంటి ఆడవార్డెన్ పెర్మిషను పొంది బైల్దేర బోతూ వుంటే యీవేళ "శకుంతల చీర నాది" అంది యశోద సుందరంతో.

సుందరం అంతకుముందు నెలనాడు నల్లంచు తెల్లనూలు చీర కొనుక్కుంది. కాటుక వాలుకన్నులా, నల్లగీత మబ్బులో యిరుక్కున్న చంద్రుడిలా వున్న ఆ చీర అందరికీ ప్రాణమై పోయింది. మళ్ళీ అలాంటి చీరలు కొనుక్కుందామని మిగతా ముగ్గురూ ప్రయత్నించినా దొరకలేదు. కొన్ననాడే చేత్తోపట్టుకుని ఏదో రాసుకుంటూంటే "అచ్చు శకుంతల్లా వున్నా" వంది సుందరం. నాటినుండి ఆ చీరకి శకుంతల చీరన్న పేరొచ్చీసింది.

❖ ❖ ❖

ఆవేళ ఆచీర కట్టుకుందామని మిగతా ముగ్గురికి బలమైన కోరికవున్నా, యశోదే తనకోరిక ముందు ప్రకటించడం మూలంగా, దాన్ని కట్టుకొనే హక్కు సంపాదించుకొంది.

బీచికి రాగానే యశోద చీర నలక్కుండా పక్కగా తిరిగి పడు కొని ఎడమచేయి మడతపెట్టి, అరచేతికి చెంప ఆనించి,